క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కిషోర్‌రెడ్డి, మధు

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన టిప్పర్ డ్రైవర్ సాయిరామ్ ఇటీవల పెదవీడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం మృతుని కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతీకిషోర్‌రెడ్డి రూ.5 వేలు, మీసాల మధు రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏసుమల్ల రాములు, సైదులు, కాశీ, రత్నం, మహేష్, తదితరులు ఉన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రి అందజేస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాలునాయక్

మఠంపల్లి : మండలంలోని లాలితండాలో పిల్లలు వేసవిలో ఆటలు ఆడుకునేందుకుగాను స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బాలునాయక్ క్రికెట్ బ్యాట్లు, రింగ్ బాల్స్, బంతులు, తదితర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంగానాయక్, శంకర్‌నాయక్, రవీందర్, సిద్దు, తిరుపతి, క్రిష్ణ, అశోక్, రాజు, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు లక్ష మల్లెపూల పూజ



సాయిబాబాకు లక్ష మల్లెపూల పూజ నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బాబాకు లక్ష మల్లెపూల పూజ, అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి వారికి శాంతి కల్యాణ్యాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొంకపాక వెంకటేశ్వర శర్మ, రాధాకృష్ణమూర్తి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, విష్ణువర్ధన్ శర్మ, భానుకిరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పిరెడ్డి కుటుంబానికి మల్లు లక్ష్మి పరామర్శ



అప్పిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లు లక్ష్మి, నాగార్జునరెడ్డి

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండకు చెందిన కోదాడ కాన్వాసింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యిర్ల అప్పిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కారద్యర్శి నాగార్జునరెడ్డి గుడిబంలో అప్పిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, ముత్యాలు, డాక్టర్ మల్లు అరుణ్, డాక్టర్ మనీషాలు ఉన్నారు.

చేతిపంపు ప్రారంభం



చేతిపంపు ప్రారంభిస్తున్న సర్పంచ్ బద్దం కృష్ణారెడ్డి

అనంతగిరి : మండల పరిధిలోని శాంతినగర్ ఈద్గా వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తాగునీటి చేతిపంపును సర్పంచ్ బద్దం కృష్ణారెడ్డి శనివారం ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈద్గా వద్ద నీటి సమస్య ఉందని ముస్లిం పెద్దలు తెలపడంతో గ్రామ పంచాయతీ నిధులు సుమారు రూ.35 వేలతో రెండు రోజుల్లో చేతి పంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు లాలు, అప్జల్, వార్డు సభ్యులు నాగభద్రం, జామాల్ సాహెబ్, గ్రామపెద్దలు, వెంకటరెడ్డి, రాఘవరెడ్డి, ముస్లింలు పాల్గొన్నారు.

మసీదు కమిటీ ఎన్నిక

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామంలో గల మసీదు నూతన కమిటీని శనివారం ముస్లిం పెద్దల సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్.హుస్సేన్, ఉపాధ్యక్షులుగా రహమతుల్లా, రహీం, ప్రధాన కార్యదర్శిగా పఠాన్ పాషా, కార్యవర్గ సభ్యులుగా సమీర్, ఫిరోజ్, ఖలీల్, వసీం, షరీఫ్, జానీ తదితరులను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రంజాన్ పర్వదిన వేడుకలను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మునగాల : మాధవరంలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



హుజూర్‌నగర్‌లో ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కోదాడఅర్బన్ : సాలార్‌జంగ్ పేటలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కోదాడఅర్బన్ : ఖబరస్తాన్ వద్ద ముస్లిం పెద్దల సమాధులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



హుజూర్‌నగర్‌లోని ఈద్గాలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



మేళ్లచెరువులో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, ముస్లింలు



కోదాడఅర్బన్ : ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు



నేరేడుచర్లలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నడిగూడెంలో..



మునగాలలో..



చిలుకూరులో..



గరిడేపల్లిలో..



కోదాడరూరల్ : గుడిబండలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ కవిత



నడిగూడెంలో తన బాల్య మిత్రుడు ఖలీల్ అహ్మద్ ఇంట్లో సేమియా తింటున్న జూలూరి గౌరీశంకర్



మఠంపల్లి : పెదవీడు మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పాలకవీడు : జాన్‌పహాడ్‌లో..



హుజూర్‌నగర్ : చింతలపాలెంలో వేడుకల్లో పాల్గొన్న ఎస్‌ఐ కృష్ణారెడ్డి, ముస్లింలు



మునగాల : బరాఖత్‌గూడెంలో..

నడిగూడెం ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పృథ్వీ

నడిగూడెం : నడిగూడెం గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నారాయణపురం పంచాయతీ కార్యదర్శి పృథ్వీని నియమించినట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య శనివారం తెలిపారు. నడిగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్నారని స్థానిక సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి ఫిర్యాదు చేయడంతో ఆయన్ని డీపీఓ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తీసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ నాగదుర్గప్రసాద్

అనంతగిరి : అనుమతులు లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కోదాడ రూరల్ సీఐ నాగదుర్గాప్రసాద్ అన్నారు. శనివారం అనంతగిరి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వేసవిలో ఆరుబయట నిద్రించేటప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు రహదారులపై ధాన్యం ఆరబోయొద్దని, కాదని ఆరబోసి ప్రయాణికుల ప్రమాదాలకు కారణమైతే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ అయిలయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సత్యనారాయణకు నివాళి

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లుకు చెందిన ముత్తవరపు సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. శనివారం గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మలో పలువురు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ నియోకవర్గ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏర్నేని బాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రామారావు, శ్రీనివాసరెడ్డి, రేపూరి వెంకటాచారి, వనపర్తి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

గరిడేపల్లి : ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ప్రాముఖ్యత తెలియజేసి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రమదోపిడికి వ్యతిరేకంగా, పనిగంటలను తగ్గించాలని కార్మిక వర్గం ఏకమై పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మస్తాన్, యడ్ల అంజిరెడ్డి, బెజ్జం రమేష్, కీసర నాగయ్య, యడవల్లి వెంకటేశ్వర్లు, ఆనందరావు, నకిరేకంటి రవి, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో అన్ని కులాలు, మతాలకు సీఎం కేసీఆర్ సమ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మత సామరస్యాలు వెల్లివిరుస్తూ ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో స్థానిక ఈద్గాను కోటి రూపాయలతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కొందరు కులాల, మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. తొలుత ఎమ్మెల్యేను ముస్లింలు శాలువాతో సన్మానించారు. ముస్లిం మత పెద్దలు, ముస్లిం, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి

హుజూర్‌నగర్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. చింతలపాలెం మండలం తమ్మవరం పునరావాస కేంద్రంలో ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.12.50 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్మశాన వాటికను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ముడెల లక్ష్మి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం అరుణ, ఎంపీటీసీ సైదిరెడ్డి, నాయకులు నర్సిరెడ్డి, ఘనీ, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : తమ్మవరం పునరావాస కేంద్రంలో శ్మశాన వాటికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కోదాడఅర్బన్ : ముస్లింల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. పట్టణంలోని ఖబరస్తాన్‌లో రూ.30 లక్షల నిధులతో పూర్తైన అభివృద్ధి పనులను శనివారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఖబరస్తాన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

దోపిడీ లేని సమాజం కోసం ఉద్యమించాలి



కోదాడఅర్బన్ : సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

గరిడేపల్లి : దోపిడీ లేని సమాజం కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. శనివారం మండలంలోని గడ్డిపల్లిలో సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో కార్మిక, కర్షక నాయకుడు లెనిన్ 153వ జయంతితో పాటు పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నందిపాటి శ్రీను, నర్సింహరావు, నగేష్, జానయ్య, అంజయ్య, మునీ, నరసయ్య, గోపి, శేఖర్, పద్మ, సుజాత, వరలక్ష్మి, భూలక్ష్మి, లింగమ్మ, సైదమ్మ, అరవింద్, శోభ, సౌజన్య తదితరులు ఉన్నారు.

న్యూడెమోక్రసీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

కోదాడఅర్బన్ : సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ పీడిత ప్రజల కోసం పుట్టిందని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. శనివారం పట్టణంలోని లాల్‌బంగ్లాలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అదేవిధంగా లెనిన్ 153వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వక్కవంతుల నర్సింహరావు, అనంతరామయ్య, ప్రతాప్, మైసయ్య, కొండయ్య, విజయ్ పాల్గొన్నారు.

ఈదురుగాలులకు దెబ్బతిన్న మామిడి తోటలు



బక్కయ్యగూడెంకు చెందిన రైతు కరణం నర్సయ్య తోటలో రాలిపడిన మామిడి కాయలు

నేరేడుచర్ల : మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మండలంలోని బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన మామిడి రైతులు కరణం నర్సయ్య తోటలో మూడు టన్నుల మామిడి కాయలు, కరణం అరవిందు తోటలో రెండు టన్నుల మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో సుమారు రెండున్నర లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

రమేష్‌బాబు ఆశయ సాధనకు పునరంకితం అవుదాం



పోటు రమేష్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : సీపీఐ సీనియర్ నాయకుడు, అమరజీవి పోటు రమేష్‌బాబు ఆశయ సాధనకు పునరంకితం అవుదామని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని రంగాపురంలో నిర్వహించిన రమేష్‌బాబు 12వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటయోధుల కుటుంబంలో జన్మించిన రమేష్‌బాబు సమాజ మార్పు కోసం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో పోటు పూర్ణచందర్‌రావు, పోటు సింధు, కిరణ్, అశోక్, పగడాల శ్రీనివాస్, బాల శౌరి, నవీన్‌చారి, దార మట్టయ్య, సైదయ్య, దార ప్రభాకర్, రాజశేఖర్, గోపి ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

చిలుకూరు : విద్యుత్ తీగలు వరికోత మిషన్‌కు తగలగా ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన శనివారం చిలుకూరులో చోటుచేసుకుంది. వివరాలు.. చిలుకూరు గ్రామానికి చెందిన సిద్దెల గురువులు పొలం వద్ద కరెంట్ తీగెలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఆ పొలంలో వరి కోస్తున్న కోత మిషన్‌కు తగిలాయి. అయితే ఆ సమయంలో కరెంట్ సరఫరా లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. కాగా గతేడాది కూడా ఇవే తీగలు కోత మిషన్‌కు తగిలి ఒకరు ప్రమాదానికి గురయ్యారని రైతులు తెలిపారు. ఆనాటి నుంచి విద్యుత్ తీగల సమస్యపై విద్యుత్ అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

వీధి కుక్కలతో బెంబేలు



రోడ్డు వెంట పడేసిన మాంసపు వ్యర్థాల వద్ద విహరిస్తున్న కుక్కలు

- ఏడాది కాలంలో 475 కేసులు
- మాంసం వ్యర్థాలను రోడ్ల వెంట పడేస్తున్న వ్యాపారులు
- వాటిని ఆవాసాలుగా చేసుకుని దాడులు చేస్తున్న కుక్కలు
- నిర్మూలించాలని ప్రజల వేడుకోలు



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు (ఫైల్)

పాలకవీడు : మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రద్దీ ప్రాంతాలు, రోడ్ల వెంట కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. దీంతో పాఠశాలలకు నడిచి వెళ్లే విద్యార్థులు భయపడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిపై వెంటపడుతూ దాడులకు తెగపడుతున్నాయి. విద్యార్థులను, రైతులను గాయపరిచిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రజలపైనే కాకుండా పశువులపై కూడా కుక్కలు దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. మండలంలో గడిచిన సంవత్సర కాలంలో కుక్కకాటుకు 475 మంది ఆసుపత్రి పాలయ్యారు. వీరందరికీ టీకాలు అందించినట్లు వైద్యులు తెలిపారు.

మాంసపు వ్యర్థాలు పడేస్తుండడంతో..

మండల పరిధిలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారుల వెంట కొందరు చికెన్ వ్యాపారులు మాంసం వ్యర్థాలు పడేస్తుండడంతో కుక్కల బెడద ఎక్కువవుతోంది. అధికారుల నిర్లక్ష్యం, చికెన్ వ్యాపారుల బాధ్యతలేని తనంతో పాలకవీడు గ్రామ శివారు నేరేడుచర్ల వెళ్లే మార్గంలో ఇష్టానుసారంగా మాంసం వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో కుక్కల బెడదతో పాటు వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతూ రోగాల భారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్న పట్టించుకోవడం లేదని అంటున్నారు. ముఖ్యంగా మండలంలోని జాన్‌పహాడ్, జాన్‌పహాడ్‌దర్గా పరిసర ప్రాంతాల్లో చికెన్ వ్యర్థాలు పడేస్తున్నారు. అధికారులు స్పందించి చికెన్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, కుక్కల బెడదను అరికట్టాలని కోరుతున్నారు.

వ్యాక్సిన్ అందుబాటులో ఉంది

ఎవరైనా కుక్కకాటుకు గురైతే నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కరిచిన చోట గాయం కాలేదని నిర్లక్షం చేస్తే ప్రాణాలమీదకు వచ్చే ప్రమాదముంది. పీహెచ్‌సీలలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

– డా.నాగిణి, వైద్యాధికారి పాలకవీడు, నేరేడుచర్ల

అప్రమత్తంగా ఉండాలి

వీధి కుక్కల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పశువైద్యశాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ సప్లై లేదు. యజమానులు, రైతులు వ్యాక్సిన్ కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. గ్రామ పంచాయతీలు కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. పశువులు, జీవాలను కుక్కలు గాయపరిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలి.

– డా. శ్రీకాంత్, పశువైద్యాధికారి, పాలకవీడు